


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 16-09-2026 | సంపుటి - 31 | సంచిక - 114 | రూ : 4 | పేజీలు: 8


## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

### సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి



- టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి : ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం
- తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్ : భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ తరువాయి 2లో

## మా మధ్య గ్యాప్ లేదు



- సీఎం, నేను సమన్వయంతో పని చేస్తున్నాం..
- గాంధీ భవన్ నుంచి గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తున్నాం రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాం
- కొండా సురేఖను ఎందుకు బర్తరఫ్ చేశామో అందరికీ తెలుసు : 'నవతెలంగాణ'తో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ : ప్రభుత్వాధినేతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సారధిగా తాను... జోడెడ్లలా కలిసి పని చేస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎంకు, తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆర్నెల్ల తర్వాత తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించానని, అప్పటి నుంచి ఇప్పటిదాకా ఏఐసీసీ రాష్ట్ర ఇంఛార్జీలైన దీపాదాస్ మున్షీ, మీనాక్షి నటరాజన్ లు తనకు ఎంతగానో సహకరించారని తెలిపారు. వారిచ్చిన ప్రోత్సాహంతో గాంధీ భవన్ నుంచి గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తున్నామని వివరించారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు తరువాయి 2లో

### పరస్పర సున్నితత్వం పాటించాలి

## జిన్‌పింగ్‌తో మోదీ స్పష్టం



- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి

ఢిల్లీ : న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి తరువాయి 2లో

### ఏఐకి ఇంకా సిద్ధం కాలేదు

## బిల్ గేట్స్ హెచ్చరిక



- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్
- సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్

2లో



### హసీనా రీఎంట్రీ వేళ షాక్

## 7 గురు నేతలకు మరణశిక్ష

- డిసెంబర్ నాటికి బంగ్లాదేశ్ వస్తానని ప్రకటించిన షేక్ హసీనా
- ఇప్పటికే హసీనాకు ఉరిశిక్ష విధించిన ట్రైబ్యునల్
- అవామీ లీగ్ నేతలకు ఉరిశిక్ష విధించిన అదే ట్రైబ్యునల్

బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన తరువాయి 2లో




### భారత విద్యార్థులకు ఊరట

## ట్రంప్ నిర్ణయంపై కోర్టు స్టే

- నాలుగేళ్ల విద్యార్థి వీసా పరిమితిపై అమెరికా కోర్టు స్టే
- ట్రంప్ ప్రభుత్వ నిబంధన అమలును తాత్కాలికంగా అడ్డుకున్న న్యాయమూర్తి
- కొత్త నిబంధన అమల్లోకి వస్తే నాలుగేళ్లు దాటితే అనుమతి తీసుకోవాల్సి వచ్చేది
- పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రభావం ఎక్కువగా ఉండేది
- నిబంధనను ప్రభుత్వం అప్పీల్ చేసే అవకాశం

2లో

### ప్రైవేట్ కోచింగ్‌పై

## చంద్రబాబు కొరడా

- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ
- జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ



2లో

### భారత్ 'కృత్రిమ సూర్యుడు'

## విజయవంతమైతే అపార లాభాలు

- గుజరాత్‌లోని ఎస్ఎస్‌టీ-1 టోకామాక్‌లో కొత్త హీటింగ్ సిస్టమ్ ఏర్పాటు
- అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ప్లాస్మాను నియంత్రించేందుకు గైరోట్రాన్ వ్యవస్థ
- సూర్యుడి కేంద్రకం కన్నా అధిక ఉష్ణోగ్రతలను సాధించిన భారత ప్రయోగాలు
- అపరిమిత శక్తినిచ్చే ఫ్యూజన్ టెక్నాలజీపై పరిశోధనలు వేగవంతం



2లో

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

హైదరాబాద్ : భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5 తండ్రి, దివంగత ఆగా ఖాన్4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

**మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి**

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

*** ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి**

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందు కోసం సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు.

*** 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5 సీఎం ఆహ్వానించారు. సమ్మిట్‌లో 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, వ్యాపార అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని సీఎం వివరించారు.

*** విద్యా, పర్యాటక రంగాల్లో సహకారంపై చర్చ**

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్5కు వివరించారు.

## పరస్పర సున్నితత్వం పాటించాలి
# జిన్‌పింగ్‌తో మోదీ స్పష్టం

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

# మా మధ్య గ్యాప్ లేదు

హైదరాబాద్ : ప్రభుత్వాధినేతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సారథిగా తాను... జోడెడ్లలా కలిసి పని చేస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎంకు, తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆర్నెల్ల తర్వాత తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించానని, అప్పటి నుంచి ఇప్పటిదాకా ఏఐసీసీ రాష్ట్ర ఇంఛార్జ్‌లైన దీపాదాస్ మున్షీ, మీనాక్షి నటరాజన్‌లు తనకు ఎంతగానో సహకరించారని తెలిపారు. వారిచ్చిన ప్రోత్సాహంతో గాంధీ భవన్ నుంచి గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తున్నామని వివరించారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి మంగళవారం నాటికి రెండేండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణ బ్యూరో చీఫ్ బి.వి.యన్.పద్మరాజుతో పలు అంశాలపై ముచ్చటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయటం, పార్టీ బలాలు, బలహీనతలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)ల నియామకం, మంత్రివర్గ విస్తరణ, రెండున్నరేండ్లలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, కొండా సురేఖ బర్తరఫ్ తదితరాంశాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... 'నేను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రెండేండ్లు పూర్తయింది. ఈ రెండేండ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, సంతృప్తికరంగా సాగింది. వాస్తవానికి పీసీసీ అధ్యక్ష పదవి అనేది భాధ్యత కంటే ఎక్కువ. ఆ బాధ్యతను నా శాయశక్తులా నెరవేరుస్తున్నాను. ఈ క్రమంలో గాంధీ భవన్‌తో బూత్ స్థాయి వరకు క్యాడర్‌ను కనెక్ట్ చేయగలిగాం. ఏ పిలుపునకు సంబంధించి అయినా ఒక్క మెసేజ్ కొడితే చాలు.. లక్షలాది మందికి చేరేలా ప్రణాళికలు రూపొందించాం...'

**మా ఇద్దరి మధ్య ఎంతో సఖ్యత...**

'సీఎం రేవంత్ రెడ్డికి, నాకు మధ్య గొడవ జరిగిందనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. మా ఇద్దరి మధ్య సఖ్యత ఎంతో బాగుంది. ఏ పార్టీలోనైనా భిన్నాభిప్రాయాలు సహజమే. సీఎంతో ఏ విషయంలోనైనా అభిప్రాయ బేధాలు వస్తే.. వాటిపై మాట్లాడుకుని సాయంత్రానికల్లా సరిచేసుకుంటాం. పార్టీకి సంబంధించిన ఏ విషయంలోనూ ముఖ్యమంత్రి ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు...'

**అదో మైలురాయి...**

'దేశంలో ఏ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టని విధంగా మేం టీపీసీసీ ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ప్రతీ వారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇది రాష్ట్ర కాంగ్రెస్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. దీనిపై కర్నాటక మాజీ సీఎం సిద్ధరామయ్య కూడా ఆరా తీసి, ప్రశంసించారు. ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి.. సంబంధిత మంత్రులు, శాఖలకు పంపుతున్నాం. వాటిలో చాలా వరకు పరిష్కారమవుతున్నాయి...'

**అదే మా ఇద్దరి లక్ష్యం...**

'దేశంలో ఇప్పుడు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. రాజ్యాంగా విలువలు ధ్వంసమవుతున్నాయి. అందువల్ల వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కచ్చితంగా గెలిచి తీరాలి. అలా గెలిచిన తర్వాత మా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది మా ఇద్దరి (రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్) లక్ష్యం. దాన్ని సాధించాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ కచ్చితంగా 15 ఎంపీ సీట్లు గెలవాలి. ఆ విధంగా గెలిపించటమే మా లక్ష్యం...'

**నా హయాంలోనే కులగణన...**

'నేను పీసీసీ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాం. ఇది నాకు సంతృప్తికరమైన అంశం. గతంలో కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో కుల సర్వే చేసినా వాటిని టేబుల్ చేయలేదు. కానీ తెలంగాణలో కుల గణన పూర్తి చేసి, సంబంధిత నివేదికను కేంద్రానికి పంపాం. కానీ మోడీ సర్కార్ దాన్ని తొక్కిపట్టింది...'

**ఆ బాధ నిజమే...**

'ఇన్ని చేసినా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను భర్తీ చేయలేకపోయాం. కార్పొరేషన్ పదవులను సకాలంలో నింపలేకపోయాం. పదేండ్లపాటు పార్టీ జెండా మోసి, కష్టపడిన వారికి పదవులు కట్టబెట్టలేదనే బాధ వెంటాడుతూనే ఉంది. అయితే సాధ్యమైనంత త్వరగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను భర్తీ చేస్తాం. డిసెంబరు నాటికి నామినేటెడ్, కార్పొరేషన్ పదవులను భర్తీ చేస్తాం. ఆ మేరకు కసరత్తులు చేస్తున్నాం...'

## ఏఐకి ఇంకా సిద్ధం కాలేదు
# బిల్ గేట్స్ హెచ్చరిక

టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు. ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

# భారత విద్యార్థులకు ఊరట.. ట్రంప్ నిర్ణయంపై కోర్టు స్టేప్

అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను నాలుగేళ్లకే పరిమితం చేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన అమలును ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా అడ్డుకుంది. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుతున్న వేలాది మంది భారతీయ విద్యార్థులకు కూడా ప్రయోజనం కలగనుంది. బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ సోమవారం దేశవ్యాప్తంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా ఈ ఆదేశాలు వచ్చాయి. ఇప్పటివరకు విదేశీ విద్యార్థులు తమ కోర్సు కొనసాగుతున్నంతకాలం అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంది. కొత్త నిబంధన అమల్లోకి వస్తే నాలుగేళ్లకు మించి చదువు కొనసాగించాల్సిన వారు ఇమ్మిగ్రేషన్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. కోర్సు మార్చడం, మరో విశ్వవిద్యాలయానికి మారడం, అదే స్థాయిలో మరో డిగ్రీ చేయడం కూడా అనుమతితోనే సాధ్యమయ్యేది. ప్రభుత్వం జాతీయ భద్రత కారణంగా నిబంధనల్లో మార్పులు అవసరమని వాదించింది. అయితే ప్రభుత్వం చెప్పిన కారణాలు బలహీనంగా ఉన్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కొత్త నిబంధన అమలైతే అమెరికా విశ్వవిద్యాలయాలు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రభావం ఎక్కువగా ఉండేదని కోర్టు పేర్కొంది. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ గణాంకాల ప్రకారం అమెరికాలో డాక్టోరల్ కోర్సులు పూర్తయ్యేందుకు సుమారు 5.7 ఏళ్లు పడుతున్నాయి. విదేశీ విద్యార్థులు, పరిశోధకులపై పరిమితులు పెడితే అమెరికాకు నష్టం కలుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. దాదాపు 22 వేల మంది కొత్త నిబంధనపై అభిప్రాయాలు పంపగా.. ఎక్కువ

## హసీనా రీఎంట్రీ వేళ షాక్..
# 7 గురు నేతలకు మరణశిక్ష

బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అవామీ లీగ్ పక్షానికి అక్కడి అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ భారీ షాక్ ఇచ్చింది. 2024లో చోటుచేసుకున్న విద్యార్థుల పోరాటం, ఉద్యమ అణచివేత కేసులో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఒబైదుల్ ఖాదర్‌తో సహా ఏడుగురు సీనియర్ నాయకులకు మరణశిక్ష ఖరారు చేస్తూ జస్టిస్ నజ్రుల్ ఇస్లామ్ చౌదరి నేతృత్వంలోని ట్రైబ్యునల్ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.

**ఉరిశిక్ష పడిన నేతలు:**

- ఒబైదుల్ ఖాదర్: ఆవామీ లీగ్ జనరల్ సెక్రటరీ & మాజీ మంత్రి
- బహావుద్దీన్ నసీమ్: జాయింట్ జనరల్ సెక్రటరీ
- మహ్మద్ అలీ అరాఫత్: మాజీ సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి
- షేఖ్ ఫజల్ షమ్స్ పరాష్, మైనుల్ హుస్సేన్ ఖాన్ నిఖిల్: జుబో లీగ్ నేతలు
- సద్దాం హుస్సేన్: ఛాత్ర లీగ్ అధ్యక్షుడు

షేక్ వలీ ఆసిఫ్: ఛాత్ర లీగ్ జనరల్ సెక్రటరీ

2024 జూలైఆగస్టు నెలల్లో దేశంలో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల ఉద్యమంపై విచక్షణారహితంగా దాడులు చేయించడం, హత్యలకు పురికొల్పడం, ప్రేరేపించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ శిక్షలు విధించారు.

# ప్రైవేట్ కోచింగ్‌పై చంద్రబాబు కొరడా

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# భారత్ 'కృత్రిమ సూర్యుడు' విజయవంతమైతే అపార లాభాలు

అపరిమిత, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో భారత్ చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. గుజరాత్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్' (ఐపీఆర్) ఆధ్వర్యంలోని స్టడీ స్టేట్ సూపర్ కండక్టింగ్ టోకామాక్ 1 (ఎస్ఎస్‌టీ 1)లో అత్యంత శక్తిమంతమైన కొత్త గైరోట్రాన్ వ్యవస్థను విజయవంతంగా అనుసంధానించారు. ఈ పరిణామంతో ఫ్యూజన్ టెక్నాలజీపై జరుగుతున్న పరిశోధనలు మరింత వేగవంతం కానున్నాయి. ఎస్ఎస్‌టీ 1 అనేది డోనట్ ఆకారంలో ఉండే ఒక ప్రయోగాత్మక ఫ్యూజన్ రియాక్టర్. సూర్యుడిలో శక్తి పుట్టే ప్రక్రియను భూమిపై సృష్టించి, తద్వారా అపారమైన శక్తిని ఉత్పత్తి చేయడమే ఈ పరిశోధనల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రక్రియలో అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ఉండే ప్లాస్మాను నియంత్రించడం అత్యంత కీలకం. తాజాగా ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్, 400 కిలోవాట్ల సామర్థ్యం గల గైరోట్రాన్, ఈ ప్లాస్మాను వేడిచేయడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఉన్న 42 గిగాహెర్ట్జ్, 500 కిలోవాట్ల వ్యవస్థతో కలిసి ఇది పనిచేయనుండటంతో శాస్త్రవేత్తలకు ప్రయోగాల్లో మరింత సౌలభ్యం లభించనుంది. సూర్యుడు తన గురుత్వాకర్షణ శక్తితో అత్యంత వేడి ప్లాస్మాను నియంత్రిస్తే, భూమిపై ఆ ప్రక్రియ కోసం శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్లాస్మాను స్థిరంగా, ఎక్కువసేపు నిలపడమే ప్రస్తుతం శాస్త్రవేత్తల ముందున్న అతిపెద్ద సవాలు. భారత శాస్త్రవేత్తలు ఇప్పటికే తమ ప్రయోగాల్లో సూర్యుడి కేంద్రకం కన్నా కొన్నిరెట్లు అధికంగా, అంటే దాదాపు 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను సాధించి రికార్డు సృష్టించారు.

## బోసి గ్రామంలో వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోసి గ్రామంలో వరసిద్ధి కర్ర విగ్నేశ్వరున్ని మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించి, వరసిద్ధి వినాయకుని జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట భైంసా మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి తో తానూర్, ముధోల్ మండలాల బిజెపి నాయకులు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించాలి



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో వసంతకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా ప్రజలకు విముక్తి లభించిందన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, విమోచన పోరాట వీరుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మల్ కొయ్య బొమ్మల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ కొయ్య బొమ్మల కళను పరిరక్షిస్తూ, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.మంగళవారం నిర్మల్ పట్టణంలోని కొయ్య బొమ్మల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొయ్య బొమ్మల చరిత్ర, తయారీ విధానం, మార్కెటింగ్, కళాకారుల పరిస్థితి, పొనికి కర్ర లభ్యత తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కళ ద్వారా నిర్మల్ జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బొమ్మల తయారీకి ప్రధానంగా ఉపయోగించే పొనికి చెట్ల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను నిర్మల్ కొయ్య బొమ్మల మార్కెటింగ్‌కు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు, అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: గర్భిణీ స్త్రీలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చేగుంటలోని పిహెచ్సి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు.వైద్యం ఎలా అందుతుంది అని అడిగి తెలుసుకున్నారు. రూములు, మెడికల్ స్టోర్ ను, డాక్టర్ల సమయపాలన హాజరు పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ నెలలు నిండుతున్న గర్భిణీలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైరిస్క్ కేసులను ఎలా పరిష్కరిస్తున్నారని, హైరిస్క్ కేసుల విషయంలో జిల్లా ఆస్పత్రి నుంచి ట్యాగ్ చేయాలన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు

*** జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో మరోసారి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు "మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ" నిర్ణయించింది. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన "మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు మాదకద్రవ్యాల బారిన పడకుండా ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పట్టణస్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇటీవల కాలంలో నల్గొండ, నకిరేకల్, మిర్యాలగూడ తదితర ప్రాంతాలలో డ్రగ్స్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని ,మాదకద్రవ్యాల వినియోగం ద్వారా ప్రాణ నష్టం వంటివి జరగకుండా నిరోధించాల్సిన బాధ్యత అందరి పై ఉందని అన్నారు. యువత, విద్యార్థులను మాదకద్రవ్యాలు ఎక్కువగా ఆకర్షిస్తున్నందున వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం, అలాగే డి అడిక్షన్ సెంటర్లో ఉన్నవారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని చెప్పారు. మద్యం షాపులలో ప్రత్యేకించి బెల్టు షాపుల్లో మైనర్ల కు మద్యం అమ్మకుండా చర్యలను కట్టుదిట్టం చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో మితిమీరిన మద్యం, పొగాకు ,గంజా వంటివి వినియోగించే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో ఎన్ వై కే కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులను నిరంతరం గమనిస్తూ ఉండాలని, ఎవరైనా ఆల్కహాల్ లేదా సిగరెట్లు,మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాల వైపు మళ్ళుతున్నట్లయితే వారిని గుర్తించి వెంటనే కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నదని, ముఖ్యంగా చిన్నవయస్కులు మత్తుమందులకు బానిస అవుతున్నారని, ఈ సంవత్సరం 130 నేర కేసులలో చిన్న వయస్సువారి భాగస్వామ్యం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిని నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మద్యం షాపులు,బెల్ట్ షాపుల్లో మైనర్లకు మద్యం అమ్మకుండా చూడాలని,కళాశాలలు, పాఠశాలల్లో కౌన్సిలర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించాలని చెప్పారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్ శ్రీకాంత్ రెడ్డి ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, డిఆర్ఓ దశరథ్, డి ఎఫ్ ఓ రాజశేఖర్, సంబంధిత జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



## విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్పాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



ప్రజాస్ఫూర్తి, భైంసా: విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
మంగళవారం ముధోల్ కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బందికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు అన్ని పూటల మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని తరగతులకు సంబంధించిన సిలబస్ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం వారిని సిద్ధం చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు పూర్తయిన సిలబస్, రోజువారిగా అందిస్తున్న భోజనం, వసతి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి పలు లెక్కలను బోర్డుపై విద్యార్థులతో చేయించి, లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఏ సబ్జెక్టులో అయినా ఎటువంటి సందేహాలు ఉన్న వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమీపంలో నిర్మాణం చివరి దశకు చేరుకున్న పాఠశాల భవంతిని కలెక్టర్ పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి భవనాన్ని వినియోగానికి తేవాలని తెలిపారు.
ఈ తనిఖీలో డీఈవో భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటు భద్రంగా ఉండాలి

*** పనుల్లో అలసత్వం వద్దు. కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఓటరు జాబితా సవరణ సర్ పనుల్లో ఎక్కడా అలసత్వం,నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని అమనగల్,బలరాం తండా,16వ వార్డు, గుమ్మడూరు ప్రాంతాల్లో జరుగుతున్న సర్ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.కలెక్టర్ ఏమన్నారంటే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా సర్ చేపట్టాలి. మ్యాపింగ్ లో సమస్య ఉన్న ప్రతి ఓటరుకు నోటీసు ఇచ్చి,11 రకాల గుర్తింపు కార్డులతో వారికి కేటాయించిన తేదీన హాజరయ్యేలా చూడాలి. ప్రభుత్వ సెలవుల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇంకా మ్యాపింగ్ చేసుకోని వారు వెంటనే స్వచ్ఛందంగా వచ్చి చేసుకోవాలి. పారదర్శక ఓటరు జాబితా కోసమే ఈ కసరత్తు అని,డబుల్ ఓట్లు, మరణించిన వారు, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, సవరణలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును సరిచూసుకుని భద్రపరచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## కన్‌సాన్‌పల్లిలో కొలువైన భారీ గణనాథుడు

*** ప్రత్యేక ఆకర్షణగా 15 అడుగల వినాయకుడు**



అందోలు, ప్రజాస్ఫూర్తిః అందోలు మండల పరిదిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని వాడవాడల భక్తి శ్రద్ధలతో విభిన్న రూపాల్లో గణనాథులు కొలువుధీరాయి. ఊరువాడల గణేషుని నిమస్మరణతో మారుమోగింది. భక్తులు మండపాలను ఏర్పాటుచేసి అందంగా అలంకరించగా విద్యూత్ కాంతుల శోభతో ప్రత్యేక కళను సంతరించుకున్నాయి. భక్తి శ్రద్ధలతో గణేషులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. యువజన సంఘాలు, ఇళ్లలో మట్టి వినాయకులకు సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల ఎత్తైన భారీ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విగ్రహదాత నోమన్నగారి నిఖిత ధీరజ్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా గ్రామ పురోహితులు ఆనంద్‌శర్మ ఘనంగా పూజలు జరిపించారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఉదయం నుంచే భక్తులు మండపాల వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు విగ్రహ దాత నిఖిత ధీరజ్‌రెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్‌లు శేరి వెంకట్‌రెడ్డి, సిహెచ్. వెంకటేశం, మాజీ వార్డు సభ్యుడు గజేందర్‌రెడ్డి, వార్డు సభ్యుడు మాధవరెడ్డి, పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నోమన్నగారి వెంకట్‌రాంరెడ్డి, హనుమంతురెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగమేశ్వర్, ప్రదీప్‌రెడ్డి దేవునూరి పోచయ్య, చాకలి ప్రభుతో పాటు మహాదేవ్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో

ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటుచే సర్ హియరింగ్ ప్రక్రియను ఆర్డీవో మధు పరిశీలించారు . ఈ సందర్భంగా ఆర్డీవో తాసిల్దార్ ను నో మ్యాపింగ్ , అనోమలిస్ లిస్ట్ ను బూత్ ల వారీగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు . నోటీస్ వచ్చిన



ఓటర్లు తమ దగ్గర ఉన్న ఆధారాలతో హియరింగ్ రావాలని ఆయన సూచిస్తూ , నూతన ఓటర్లు కూడా అప్లికేషన్ పెట్టుకోవచ్చని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగరాజు , గిర్దవర్ సత్యనారాయణ , జిపిఓ బాలాజీ ,బిఎల్వోలు , పాల్గొన్నారు .

## పర్యావరణ ప్రేమికుడికి అరుదైన గౌరవం

*** ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన దైద వెంకన్న**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఇందిరా నగర్ కు చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త,సామాజిక సేవకులు దైద వెంకన్నకు అరుదైన గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన గత కొన్నేళ్లుగా చేస్తున్న నిరంతర కృషికి, విశేష సేవలకు గుర్తింపుగా భారత్ రక్తదాన్ మిషన్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక *"ఉత్తమ సేవా పురస్కారం"కు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు ఒక ప్రకటన విడుదల చేశారు. మొక్కలు నాటడం, పర్యావరణంపై అవగాహన కల్పించడం, స్వచ్ఛత కార్యక్రమాల్లో వెంకన్న చూపుతున్న చొరవ అభినందనీయమని, అందుకే ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 20వ తేదీన ఆత్మకూర్ పట్టణంలోని పి.ఎస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరగనుందని, ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.పురస్కారానికి ఎంపికైనందుకు దైద వెంకన్న హర్షం వ్యక్తం చేస్తూ,భారత్ రక్తదాన్ మిషన్ అసోసియేషన్ సభ్యులకు,తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా దామన్న జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దివంగత నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ ఫ్లైఓవర్ వద్ద కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు ల ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ హాజరై ప్రజలకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, వీరన్న నాయక్, కక్కిరేణి శ్రీనివాస్, అంజద్ ఆలి, నరేందర్ నాయుడు, చిలుముల సైదిరెడ్డి, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, గుణగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఎల్దుర్తి మండలం హక్కింపేట గ్రామ పరిధిలోని హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో దేవసోత్ దశరథ్, మల్లారెడ్డి నవీన్‌రెడ్డి, ఎండీ హుస్సేన్, దొడ్ల వినోద్, మల్లబోయిన గణేష్, పాశం మాణిక్‌రెడ్డి, గాండ్ల రాజు ఉన్నారు. వారి నుంచి రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో జూదం, బొమ్మా బొరుసు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ జూదం, బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## వై ఎస్ సి ఏ గణేశుడి వద్ద ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: మండల కేంద్రంలో వై ఎస్ సి ఎ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడు వద్ద ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో విగ్రహ దాత గంగాపురం సతీష్ గౌడ్ కల్పన, జాల వలిభాష, పల్సం రాజు, కొండూరు అంజయ్య, గంగాపురం బుచ్చిబాబు, వెల్లంకి కొండలు, పబ్బు స్వామి, రచ్చ గణేష్, కొండూరు సాయి, పబ్బు వెంకన్న, కొండూరి భాస్కర్, ఆజాం, బిక్షపతి పబ్బు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులను వేగవంతం చేయాలి



భూపాలపల్లి ,(ప్రజా స్ఫూర్తి) : మండలంలోని అకినేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అకినేపల్లి గ్రామంలో రీసర్వే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న తీరును, భూ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. భూ సరిహద్దులకు సంబంధించి వివాదాలు ఉన్న ప్రాంతాల్లో రైతుల సమక్షంలోనే వివరాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ పరిమితులను కచ్చితంగా నిర్ధారించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.రీసర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, సర్వే వివరాలు, భూ రికార్డుల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్వే, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ ఆవుల పిచ్చయ్యకు ఘన నివాళి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని కీతవారిగూడెంలో కామ్రేడ్ సుందరి బిక్షమయ్య భవనంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ ఆవుల పిచ్చయ్య 7వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తుమ్మల సైదయ్య, సుందరి వీరరాఘవయ్య, బొల్లెపల్లి శ్రీనివాసు, జుట్టుకొండ మట్టయ్య, ఆవుల సైదులు, భూతం నాగరాజు, ఆవుల ప్రసాదు, మేరిగా శ్రీనివాసు, ఒలిశెట్టి వెంకన్న, తుమ్మల వెంకటేశ్వర్లు, కొత్తకొండ సైదులు, జుట్టుకొండ శ్రీనివాసు, ఇండ్ల వెంకటేశు, భూతం సరిత, ఎల్లావుల పిచ్చమ్మ, ఇనుకుర్తి ధనలక్ష్మి, ఆవుల అంజయ్య, వంశీ, పాలేలి రాజు తదితరులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి



ప్రజాస్ఫూర్తి, జన్నారం : విశ్వబ్రాహ్మణులలో ఉన్న పేదవారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ అన్నారు.రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం ఆదేశానుసారంజిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్,జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి అన్నపూర్ణ ల ఆధ్వర్యంలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ మంచిర్యాల జిల్లా కార్పొరేషన్ టౌన్ అధ్యక్షులుగా చెల్లోజు సుగుణాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా సతీష్ చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామ్మోహన్ చారి లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి నరసింహ చారి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజా చారి, నస్పూర్ అధ్యక్షులు మునిగంటి సత్యనారాయణ ,జన్నారం కోశాధికారి తొగిటి కిషన్ లు పాల్గొన్నారు

## ఘనంగా ఇంజనీరింగ్ డే వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలోసింగరేణిలోఇంజినీర్స్‌డేవేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సంస్థ ఈఅండ్ఎం డైరెక్టర్ తిరుమలరావుతోపాటు వివిధ విభాగాలకు చెందిన పలువురు జనరల్ మేనేజర్లు, సివిల్ విభాగం ఏజీఎం సతీష్, ఇంజినీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న ఇంజినీర్లను బ్రహ్మకుమారీ సోదరీమణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఇంజినీర్లు, బ్రహ్మకుమారీస్ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

**– విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం**

భారతరత్న, ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో మంగళవారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీర్లను సత్కరించారు. విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్, డీఈ రంగస్వామి, ఏఈ పావనిలను శాలువాలతో సత్కరించారు. పంచాయతీరాజ్ శాఖ డీఈ నాగేందర్, ఈఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖకు చెందిన రాజశేఖర్‌రావు, ఏఈ శివనాథ్, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ సదయ్య, డీవీ రామరాజు, జేటీఓలు సందీప్, సాయికిరణ్, బాలకృష్ణ, పరమేశ్వర్, రామవరం సింగరేణి వర్క్‌షాప్ ఎస్ఈ శ్రీనివాసరావు, సివిల్ సూపర్‌వైజర్ షబ్బీర్‌లను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం అధ్యక్షుడు లయన్ దోతి బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ పగడాల నాగేష్, లయన్ డిస్ట్రిక్ట్ సభ్యులు శాంతయ్య, పితాని సత్యనారాయణ, గుబ్బల వాసు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమము అభివృద్ధి కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : గిరిజనుల సంక్షేమము, అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎస్టి సెల్ మండల నాయకులు రాములు నాయక్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆదివాసి, గిరిజన నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఆదివాసి గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా తండాలు, గూడాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత కేసీఆర్ కె దక్కుతుందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసి గిరిజనులకు చేసిన మేలుకు కృతజ్ఞతగా ఈనెల 17వ తేదీన జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి గిరిజన నాయకులు పాలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు.కావున ఈ కార్యక్రమానికి ఆదివాసి గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి గిరిజన నాయకులు,కామన్ పెల్లి ఉప సర్పంచ్ తేజవత్ భరత్ నాయక్, బాధవత్ సాయికిరణ్, నాగవత్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## గీకురు రవీందర్ కుటుంబానికి అండగా ఉంటాం



*** పరామర్శలో ధైర్యం చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి : ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ చిత్రపటానికి రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి మంగళవారం ఘన నివాళులర్పించారు. చిగురుమామిడిలోని రవీందర్ నివాసానికి వెళ్లిన మంత్రి,ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గీకురు రవీందర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను కొనియాడారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి,నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయన ఎంతో శ్రమించారని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటూ,స్థానిక ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రశంసించారు. ఆయన అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి,స్థానిక నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.రవీందర్ ఆశయాలకు అనుగుణంగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందని,ఏ కష్టం వచ్చినా ఆదుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు గట్టి భరోసా ఇచ్చారు.రవీందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,ఈ తీవ్ర శోకంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ఆకాంక్షించారు. చిన్నముల్కనూరులో ఇటీవల మృతి చెందిన కొయ్యడ రాజ్ కుమార్ చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,ప్రజా ప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## రాజ్యాంగం కల్పిత కథ కాదు... భారత ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

**- సీడీఎఫ్**




ప్రజాస్ఫూర్తి ,జన్నారం : హమారా ప్రసాద్ రచించిన "రాజ్యాంగం ఒక కల్పిత కథ" అనే పుస్తకాన్ని ఈ నెల 18న ఆవిష్కరించనున్న నేపథ్యంలో క్రిస్టియన్ డెమొక్రటిక్ ఫోరం (సీడీఎఫ్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా సీడీఎఫ్ రాష్ట్ర ఫైనాన్స్ కం. ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాస్టర్ ఫాలేమ్ రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, మత స్వాతంత్ర్యం, ప్రాథమిక హక్కులు కల్పించే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ అని పేర్కొన్నారు.రాజ్యాంగాన్ని కించపరిచేలా లేదా ప్రజల్లో అపోహలు కలిగించేలా ప్రచారం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇలాంటి కార్యక్రమాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తామని సీడీఎఫ్ స్పష్టం చేసింది. రాజ్యాంగాన్ని అవమానించే ఏ చర్యనైనా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టపరమైన మార్గాల్లో ఎదుర్కొంటామని సీడీఎఫ్ ప్రకటించింది.రాజ్యాంగాన్ని కాపాడటం అంటే ప్రతి భారతీయుడి హక్కులను కాపాడటమే.రాజ్యాంగ పరిరక్షణ కోసం క్రైస్తవ సమాజం ఐక్యంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకులకు జాతీయ సేవారత్న అవార్డులు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రజా సేవలో ముందుంటున్న తాతా మనవళ్లకు జాతీయ సేవారత్న పురస్కారం లభించింది. కొత్తగూడెం పట్టణం రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ముస్తఫా, ఆయన మనవడు మహమ్మద్ ఆఫాన్ జైదీలను ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ సేవారత్న పురస్కారంతో సత్కరించింది. బెంగళూరులో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుమారు వంద మందిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ముస్తఫా, ఆఫాన్ జైదీ హాజరయ్యారు. ఈ పురస్కారాలను కస్టమ్స్ అధికారి డాక్టర్ విద్యాధర్, ధర్మవరపు నరేందర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షుడు సోమల శివరాజు చేతుల మీదుగా ముస్తఫా, ఆఫాన్ జైదీ అందుకున్నారు.

## పేదలకు అండగా నిలుస్తున్న సిఎం ఆర్ ఎఫ్ పథకం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సిఎం ఆర్ ఎఫ్ పథకం పేదలకు వైద్య ఖర్చులకు అవసరమైన సహాయం అందజేస్తూ పేదలకు వరంగా మారిందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మాజి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాల 21మంది లబ్దిదారులకు మొత్తం రూ. 7,93,000/ విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య చికిత్స కోసం ఈ సాయాన్ని మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు వెలుగు వెంకన్న, కౌన్సిలర్ లు జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, నాయకులు సైదిరెడ్డి, తండు శ్రీనివాస్, వల్దాసు దేవేందర్, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వీర వనితల స్ఫూర్తి యాత్రను జయప్రదం చేయండి: ఐద్వా



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మహిళలు చూపిన వీరత్వాన్ని, స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు చేపడుతున్న 'వీర వనితల స్ఫూర్తి యాత్ర'ను జయప్రదం చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకట చంద్ర పిలుపునిచ్చారు.మండల పరిధిలోని కీతవారిగూడెంలో గల కామ్రేడ్ సుందరి బిక్షమయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 నుండి 17 వరకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల మీదుగా ఈ జీబు జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి రమాదేవి, యానాల సుశీల, భూతం సరిత, ఎల్లావుల పిచ్చమ్మ, ఇనుకుర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హమార ప్రసాద్ ను వెంటనే అరెస్టు చేయాలి




ప్రజాస్ఫూర్తి , జన్నారం : అంబేద్కర్ గౌరవాన్ని కించపరిచే విధంగా పుస్తకం రాసిన హమార ప్రసాద్ ను అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జన్నారం మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సిటీమల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కించపరిచే విధంగా పుస్తకం రాసిన హమార ప్రసాద్ ను ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య, రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్,మాలమహానాడు మండల అధ్యక్షులు దాముక కరుణాకర్,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గోనె ప్రభాకర్ మాదిగ, జిల్లా నాయకులు ప్రభుదాస్, సర్పంచుల ఫోరం మాజీ మండల కన్వీనర్ జాడి గంగాధర్, ఎం ఎస్ పి మండలం అధ్యక్షులు విజయ్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు రత్నం మాణిక్యం, దుమ్మల ప్రవీణ్ ,జనుగురు మల్లయ్య, దుమల్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 5 సంవత్సరాల లోపు చిన్నారుల మరణాలపై ప్రత్యేక

భువనగిరి, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారుల మరణాలను తగ్గించేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల మరణాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఐడీఓసీ కలెక్టరేట్ లో జరిగింది.సమావేశంలో జిల్లాలో నమోదైన చిన్నారుల మరణాల కేసులను సమగ్రంగా సమీక్షించి, మరణాలకు దారితీసిన కారణాలను విశ్లేషించారు. ముఖ్యంగా గర్భిణీలకు సకాలంలో వైద్య సేవలు అందించడం, ప్రమాదకర గర్భధారణలను ముందుగానే గుర్తించడం, ప్రసవానంతర తల్లి-శిశు సంరక్షణ, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడడంపై అధికారులకు సూచనలు చేశారు.చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అనారోగ్య లక్షణాలు ఉన్న పిల్లలను సకాలంలో గుర్తించి అవసరమైన వైద్య చికిత్స కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సీహెచ్ఓలు, ఎంఎల్హెచ్పీలు,హెచ్ఈ లు సమన్వయంతో పనిచేసి శిశు మరణాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ డా. కె. రామకృష్ణ, పీఓ -సీహెచ్ &ఐ డా. కె. రామకృష్ణ, డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ డా. కవిత, హెచ్ఓడి (పెడియాట్రిక్స్) డా. హబీబ్ అలీ, హెచ్ఓడి గైనకాలజీ డా. శీలాపాణి, హెచ్ఓడి అనస్థీషియా డా. కరుణ్ రెడ్డి, ఎస్డిసీయు నోడల్ అధికారి, వివిధ పీహెచ్సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## మల్యాల గిరిజన గ్రామంలో వైద్య శిబిరం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలం మల్యాల గిరిజన గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉమాశ్రీ ఆదేశానుసారం మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి వాటి నివారణ చర్యల గురించి నీరు నిలువ ఉండకుండా చూడడానికి మరియు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు తెలియజేసి డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి నవనీల, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏఎన్ఎం పద్మ, పంచాయతీ కార్యదర్శి కలీం, ఆశా కార్యకర్త తిరుమల గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మేదర బస్తీలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణ పరిధిలోని మేదర బస్తీలో ప్రముఖ వ్యాపారస్తులు ఆయిత ప్రకాష్, విజయలక్ష్మి దంపతుల స్వగృహంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం కలగాలని ప్రార్థించారు. అనంతరం వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు ఆధ్వర్యంలో మిత్రబృందం పల్లపోతు వాసు, బొడ్ల మహేష్, నాగేశ్వరరావు, గునిపాటి ఆనంద్, ఆయిత ప్రకాష్ లు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## విద్యానగర్ గణేష్ చౌరస్తాలో హై మాస్ట్ లైట్ల ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీలోని 33 వ వార్డు విద్యానగర్ గణేష్ చౌరస్తాలో హై మాస్ట్ లైట్లను ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పన భద్రత కల్పించడం భాగంగానే స్థానిక కౌన్సిలర్ నాగుల వాసు కోరిక మేరకు గణేష్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్స్ లను ప్రారంభించామని అన్నారు. ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ , కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్,పార్టీ నాయకులు వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, పడిదల రవి, నరేందర్ నాయుడు, రాచకొండ శ్రీనివాస్, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట వరం.. సీఎం సహాయనిధి

- సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యాల బారిన పడిన నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరంలాంటిదని సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన గుడ్డేటి మమత రూ.34వేలు, రావిరాల అంజయ్య రూ.21వేల చొప్పున మంగళవారం ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందన్నారు. అనారోగ్యాల భారిన పడిన నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీఎం సహాయనిధి చెక్కుల మంజూరు కి సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, ఆదిమూలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ డే సందర్భంగా పంచాయతీరాజ్ ఈఈ , డిఈ కు సన్మానం

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఇంజనీర్స్ డే సందర్భంగా విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ , సిపిఐ పార్టీ చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డిఈ , నాగేందర్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళి మాట్లాడుతూ రాబోయే తరాలకు అవసరానికి అనుగుణంగా కావలసిన ప్రాజెక్టులు , రోడ్లు ,ప్లాన్స్ ఇవ్వటంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ కృషి అద్భుతం అని ఆయన అన్నారు .

# గిరిజనులకు స్వర్ణయుగం కేసీఆర్ పాలన

- * తండాల్లో పాలాభిషేకాలకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ గిరిజన నాయకుల సమావేశం సోమవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే,పార్టీ ఇంచార్జ్ బానోత్ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు స్వర్ణయుగం కేసీఆర్ పాలన అని అన్నారు. “అపన్ తాండే మా.. అపన్ రాజ్” తో ఆత్మగౌరవం కల్పించి, తండాలను 3146 ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. నేడు 3146 మంది సర్పంచులుగా, 25 వేలకు పైగా వార్డు సభ్యులుగా గిరిజనులు రాణిస్తున్నారంటే అది కేసీఆర్ పుణ్యమేనని పేర్కొన్నారు. గిరిజన రిజర్వేషన్లను 6% నుండి 10% కి పెంచి గిరిజన జాతికి గౌరవం కల్పించిన కేసీఆర్ కు కృతజ్ఞతగా ఈ నెల 17న ప్రతి తండాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు, కేటీఆర్ కు, హరీష్ రావుకు, సత్యవతి రాథోడ్ కు గిరిజన జాతి రుణపడి ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులు వినాయక నిమజ్జనాన్ని జరుపుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- * ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లా భువనగిరి పట్టణ శివారు లోని పెద్ద చెరువు వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లను జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, ట్రాఫిక్ డి యస్ పి ప్రభాకర్ రెడ్డి, భువనగిరి డి యస్ పి రవీందర్ తో కలసి మంగళవారం ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా భువనగిరి పెద్ద చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులో నీటిమట్టం ఉన్న నేపథ్యంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యత భారీ కేడింగ్ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు చెరువు వద్ద క్రేన్లు, లైటింగ్, శానిటేషన్, త్రాగునీరు వైద్య సదుపాయాలు టాయిలెట్లు అన్ని సిద్ధం చేయాలన్నారు . నిమర్జనానికి తగిన విధంగా పోలీసు, ట్రాఫిక్, రెవిన్యూ, మత్య శాఖ, అగ్నిమాపక శాఖ సంబంధిత అధికారులు వారికి కేటాయించిన విధుల్లో సమర్థవంతంగా నిర్వహించాలని .నిమజ్జనానికి విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో కూడా ప్రజలు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల భద్రతే షీ టీం లక్ష్యం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : విద్యార్థినులు, మహిళలు, బాలికల భద్రతకు షీ టీం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మాట్లాడుతూ సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించరాదన్నారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపుల్లో పరిచయస్తుల ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని, అలాంటి సందర్భాల్లో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా షీ టీంను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. బాలికలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే షీ టీం 8712658162, అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అలాగే గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ చట్టాలపై నిజ జీవిత సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం

# ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలి

- * ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: ఖరీఫ్ సీజన్ 2026 2027 ధాన్యం కొనుగోళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్ల పై మంగళవారం ఇంచార్జి కలెక్టర్ ఛాంబర్ లో వివిధ శాఖల అధికారులతో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 3,00,000 లక్షల మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఐకేపీ 147 పీఏసీఎస్ 160, యఫ్ పి ఓ 15, మెప్మా 3 ఆద్వర్యంలో మొత్తం 325 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టేలా చూడాలని, వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోళ్లకు అనుగుణంగా గన్ని సంచులు తెప్పించాలని సూచించారు. అదనపు టార్పాలిన్లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు , గ్రైన్ కాలిపర్స్ , తేమ యంత్రాలు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, డ్రైయర్స్ అందుబాటులో ఉండాలని తెలిపారు. కొనుగోలు చేసిన వరిధాన్యం నిల్వ చేయుటకు గోదాములను గుర్తించవలసినదిగా జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి మరియు జిల్లా మేనేజరు, పౌరసరఫరాల సంస్థ అధికారులను ఆదేశించారు. గోదాముల వద్ద మరియు పీపీసీ కేంద్రాల వద్ద సరిపడు హమాలీలను నియమించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి,డీసీఎస్ఓ రోజారాణి , జిల్లా డీఎం హరికృష్ణ , జిల్లా సహకార శాఖ అధికారి వ్యవసాయ శాఖ అధికారి రమణా రెడ్డి , జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హేమంత్ చారి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన హేమంత్ చారి తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర చైర్మన్ నవీన్ పెట్టం నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హేమంత్ చారి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి ప్రభుత్వం ఏర్పడేందుకు కృషి చేస్తానన్నారు.నాపై నమ్మకం ఉంచి కార్యదర్శి నుండి ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పించిన చైర్మన్ నవీన్ పెట్టం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పట్ల పనిభారం, అధికారుల ఒత్తిడి తగదు

: సిఐటియు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం సీఐటీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పని ప్రాంతాల్లో జరిగిన మీటింగ్‌లో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పాల్గొని ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం సింగరేణి ఏరియాలో , కార్పొరేట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పట్ల పని భారాన్ని తగ్గించాలని అధికారులు ఒత్తిడి వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేస్తూ , స్వీపింగ్, స్కావెంజింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే మ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు పప్పుల ప్రమోద్, ఏరియా కార్యదర్శి పిచ్చెట్టి శివ కార్మికులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన జిల్లా మహిళా అధ్యక్షురాలుగా మామిళ్ళపల్లి ఉమారాణి నియామకం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:తెలంగాణ రక్షణ సేన సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలుగా, శ్రీ వాసవి సేవా సమితి సభ్యురాలు మామిళ్ళపల్లి ఉమారాణి నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ నియమించినట్లు ఆమె తెలిపారు. సూర్యాపేటకు చెందిన మామిళ్ళపల్లి ఉమారాణి గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. గతంలో జాగృతి లో పలు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించిన కల్వకుంట్ల కవితమ్మకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన తరుపున మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై పోరాటం నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆమె నియామకం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.

## సెప్టెంబర్ 17 వేడుకలు అధికారికంగా నిర్వహించాలి

- * సీపీఐ నేత అజయ్ సారథి రెడ్డి డిమాండ్

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మూడు కోట్ల జంక్షన్ లోని తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద సెప్టెంబర్ 17 వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథి రెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం పట్టణ మండల సీపీఐ నేతల సమావేశం వెలుగు శ్రావణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ నిజాం పాలనను తరిమికొట్టింది సాయుధ పోరాటమేనని, మానుకోట ప్రాంతం ఈ పోరాటంలో వీరోచిత పోరాటం చేసిందని,సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని అన్నారు.సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుండి 17 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, 17న ముగింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ నేతలు పెరుగు కుమార్, రేశపల్లి నవీన్,చింతకుంట్ల వెంకన్న,మామిళ్ల సాంబలక్ష్మి,కట్లోజు పాండురంగ చారి, తండా సందీప్, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, బానోత్ లింగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీవీఆర్ఐటీలో 3డీ ప్రింటింగ్‌పై ఐదు రోజుల శిక్షణ



నర్సాపూర్,(ప్రజాస్పూర్తి) : బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో '3డీ ప్రింటింగ్ మరియు అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అంశంపై ఐదు రోజుల హ్యాండ్స్-ఆన్ శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీఈఐడియా ల్యాబ్, డిజైన్ ల్యాబ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఐఐటీ పాలక్కాడ్‌కు చెందిన డాక్టర్ కన్నన్ సుబ్బు ఎస్. ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు 3డీ ప్రింటింగ్ సాంకేతికతపై అవగాహన కల్పించారు. పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల్లో 3డీ ప్రింటింగ్ వినియోగం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీన్ డాక్టర్ వి. మురళీకృష్ణ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. విష్ణు, డాక్టర్ ఎం. సుధీర్‌తో పాటు పలువురు డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ సమన్వయంతో చేపట్టారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

*** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



భూపాలపల్లి, (ప్రజా స్పూర్తి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని, జిల్లాలో మంజూరైన ఇళ్లను త్వరగా గ్రౌండింగ్ చేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో గ్రౌండింగ్ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాను గృహ నిర్మాణంలో ఆదర్శంగా నిలపాలంటే మంజూరైన ఇళ్లను వేగంగా గ్రౌండింగ్ చేసి, నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లు ఏయే దశల్లో ఉన్నాయో మండలాల వారీగా సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. నిర్మాణ పనులకు సంబంధించిన ఎం.బీ. నమోదులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో భూపాలపల్లి జిల్లా ముందువరుసలో ఉండేలా అధికారులు పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, అన్ని మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## తాండ్ర వీరేందర్ రెడ్డి కి ఘన నివాళి




ప్రజాస్పూర్తి, షాద్నగర్ : ప్రముఖ న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, లయన్స్ క్లబ్ చైర్మన్‌గా సేవలందిస్తూ షాద్‌నగర్ ప్రాంత ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న స్వర్గీయ తాండ్ర వీరేందర్ రెడ్డి 'వకీల్ సాబ్' 81వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయన సేవలను, మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, సేవా స్పూర్తి నేటి తరానికి సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయి.స్వర్గీయ తాండ్ర వీరేందర్ రెడ్డి 'వకీల్ సాబ్' 81వ జయంతి సందర్భంగా ఆయన పవిత్ర స్మృతులను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



జగద్గిరిగుట్ట, ప్రజాస్పూర్తి : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగద్గిరి గుట్ట డివిజన్ మగ్దూంనగర్ లో దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కాలనీ వాసులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేష్ మండపం వద్ద చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులు, చిన్నారులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## కుత్బుల్లాపూర్ టి ఆర్ ఎస్ ఇంచార్జి గా ఎత్తరి మారయ్య నియామకం

కుత్బుల్లాపూర్, ప్రజాస్పూర్తి : తెలంగాణ రక్షణ సేన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గా ఎత్తరి మారయ్య నియమితులయ్యారు. వడ్డెర సంఘం నాయకునిగా కింద స్థాయి నుంచి ఎదిగిన నాయకుడుగా ఎత్తరి మారయ్య కు గుర్తింపు ఉంది. బిఆర్ ఎస్ పార్టీ నుంచి కవిత తో పాటు ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇందుకు గుర్తింపు గానే నియోజకవర్గం ఇంచార్జి పదవి దక్కింది. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కుత్బుల్లాపూర్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి పోరాడుతానని ఈ సందర్భంగా మారయ్య తెలిపారు. అధికారం కోసం కాదు... ప్రజల కోసమే తన రాజకీయ లక్ష్యం అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం లేకుంటే ఈ ప్రాంతానికి విముక్తి లేదు

*** సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**



చిగురుమామిడి,(ప్రజాస్పూర్తి):కమ్యూనిస్టు పార్టీ నేతల ప్రాణ త్యాగాల మూలంగా తెలంగాణ ప్రాంతం విముక్తి కాబడిందని,రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని,ఆ మహత్తర పోరాటాన్ని వక్రీకరిస్తే సిపిఐ చూస్తూ ఊరుకోదని సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 11నుంచి 17వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ చిగురుమామిడి మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం ఇందుర్తి, గునుకులపల్లి, ఒగులాపూర్, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట, చిగురుమామిడి,రేకొండ బొమ్మనపల్లి గ్రామాలలో అమరులైన వీరుల స్మారక స్తూపాల వద్ద చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరీ విముక్తి కోసం,బానిసత్వానికి వ్యతిరేకంగా,ఆకలి మంటలు,ఆర్తనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం దాస్య శృంఖలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సర్పంచ్ లు చింతపూల నరేందర్,కొంకట మౌనిక,జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్,న్యాలపట్ల రాజు,రాష్ట్ర జాతీయ కౌన్సిల్ సభ్యులు కవ్వంపెల్లి స్వామి,జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్న స్వామి,కాంతాల శ్రీనివాస్ రెడ్డి,బోయిని పటేల్,తేరాల సత్యనారాయణ,కన్నం లక్ష్మీనారాయణ,వరుకోలు సదానందం,దుడ్డేల సమ్మయ్య, ఉప సర్పంచ్ చింతపూల అనిల్ కుమార్,సిపిఐ మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ,పైడిపల్లి వెంకటేష్, సీనియర్ నాయకులు ముద్రకోల రాజయ్య,మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి,కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా,మంద ఎల్లయ్య,ఎలగందుల రాజు,చెప్యాల శ్రీనివాస్,అనుమోజు జనార్ధన్,ఇల్లందుల రాజయ్య,కయ్యం తిరుపతి,నీల వెంకన్న,అందె సంపత్, కయ్యం వీరన్న, మున్సు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో ఈ పంచాయతీ ఆపరేటర్ల హవా

*** సర్వసభ్య సమావేశంలో వాడి వేడి చర్చ**



గరిడేపల్లి, ప్రజాస్పూర్తి : గరిడేపల్లి మండల పరిషత్ లో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం గరం గరం గా జరిగింది. సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సర్పంచులు కొంతమంది మండల అధికారుల తీరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలో ఏ శాఖలో ఏ అధికారి పనిచేస్తున్నారు సర్పంచులు గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయిందని పలువురు సర్పంచులు వాపోయారు. సర్వసభ్య సమావేశానికి చాలామంది అధికారులు రాకపోవడంపై సర్పంచులు కొంతమంది ఎంపీడీవోను నిలదీశారు. మండలంలోని పొనుగోడు సర్పంచ్ కటకం వేణు, రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజి గౌడ్, కుతుబ్బిషాపురం సర్పంచి ఆకుల కృష్ణ తోపాటు మరికొంత మంది సర్పంచులు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. మండల అధికారులు చెబుతున్నదొకటి చేసేది ఒకటి అన్న చందంగా ఉందని వారు ఆరోపించారు. పొనుగోడు సర్పంచి కటకం వేణు, రాయినిగూడెం సర్పంచి గుండు రామాంజిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు నిధులు వస్తున్నాయా, ఒకవేళ నిధులు వస్తే వాటికి ఆడిటింగ్ జరుగుతుందా అని ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన కనీస సమాచారాన్ని అందించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని వారు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ పంచాయతీ ఆపరేటర్ల హవా నడుస్తుందని, గ్రామ పంచాయతీకి వచ్చిన డబ్బులు తీసుకునేందుకు కూడా సర్పంచులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అసలు ఎంపీడీవో ఉన్నారా, వారి మాట చెల్లుబాటు అవుతుందా లేదా అనే అనుమానం తలెత్తుతుందన్నారు. ఈ పంచాయతీ ఆపరేటర్లు గ్రామ పంచాయతీలకు డబ్బులు అందించే విషయంలో పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. సాగర్ నీటిని విడుదల చేసింది పంట పొలాలక, చెరువులు నింపటానికి అని వారు ప్రశ్నించారు. సాగర్ నీటి విడుదల ఎందుకో కనీస స్పష్టత లేదని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఏదైనా సమస్య ఉంటే ఫోన్ చేసిన సంబంధిత స్పందించడం లేదని ఆరోపించారు. దీనికి స్పందించిన ఏ ఈ యోగి మాట్లాడుతూ గరిడేపల్లి, పాలకవీడు మండలాలకు ఇన్చార్జిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎవరు ఫోన్ చేసినా స్పందిస్తున్నానని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని ఆయన వివరణ ఇచ్చారు. పొనుగోడు లో రేషన్ షాప్ ను ఎల్బీనగర్ గ్రామానికి చెందిన డీలర్ నిర్వహిస్తున్నారని దీంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని సర్పంచ్ వేణు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పొనుగోడు రేషన్ షాపు నిర్వహించేందుకు నూతనంగా డీలర్ ను నియమించాలని కోరారు. కుతుభిషా పురం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని వెంటనే కొత్త డీలర్ నియమించాలని గ్రామ సర్పంచ్ ఆకుల కృష్ణ అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎల్ 3 నుంచి ఎల్ 1 కు మార్చాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచులు అధికార దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో నిర్మిస్తున్న వివోఏ నూతన భవనాలను బి ఆర్ ఎస్ పార్టీకి సంబంధించిన సర్పంచులు ఉన్నచోట నిర్మించడం లేదని పలువురు బి ఆర్ ఎస్ పార్టీ అనుబంధ సర్పంచులు అధికార దృష్టి తీసుకొచ్చారు. సంబంధిత గ్రామాల్లో కూడా వివోఏ నూతన భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. వీటితోపాటు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, నీటిపారుదలకు సంబంధించిన అనేక విషయాలను సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి సర్పంచులు తీసుకొచ్చారు. వాటికి స్పందించిన సంబంధిత శాఖ అధికారులు సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, తాసిల్దార్ స్రవంతి, ఎం ఈ ఓ చత్రునాయక్, ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఎం అజయ్, ఏపీవో సురేష్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి తోపాటు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జి పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

*** కలెక్టర్ కె.హరిత**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్పూర్తి: జిల్లాలో బాల్యవివాహాల నివారణకు, లైంగిక నేరాల నుండి బాలలను రక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య కార్యక్రమం క్రింద బాల్య వివాహాల నిషేధిత చట్టం, పోక్సో చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బాల్య వివాహాల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహాల వలన భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. కిశోర బాలికల సాధికారతను సమర్థవంతంగా పర్యవేక్షించాలని, పాఠశాలలు, కళాశాలలో బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మన అంగన్వాడి మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పోషణ మాసం పై అధికారులతో సమీక్షించారు. ఈ నెల 9వ తేదీ నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, 3 సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలు అందరూ అంగన్వాడీ లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుబంధ పోషకాహారాలైన పప్పు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పోషణ మాసం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, డి సి పి ఓ మహేష్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందాస్, సి డి పి ఓ లు, సఖి బాలల రక్షణ సిబ్బంది, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం పూర్తి చేసుకోండి

*** మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ పిలుపు**

ప్రజాస్పూర్తి , షాద్నగర్ : గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ గణేష్ మండలి నిర్వాహకులకు పిలుపునిచ్చారు.



షాద్‌నగర్ పట్టణంలోని బొబ్బిలి చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, పోలీస్ శాఖ ఎస్ఐలు, విద్యుత్ శాఖ ఏఈ వినోద్ తదితర అధికారుల బృందం పరిశీలించింది. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను వారు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ కోరారు.

## వినూత్న రీతిలో దామన్న 74వ జయంతి వేడుకలు



ప్రజాస్పూర్తి, సూర్యాపేట: తన రాజకీయ గురువు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి కార్యక్రమం స్థానిక కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద టీ షర్ట్ ల పై జోహార్ దామన్న అని ముద్ర వేయించి వినూత్నంగా నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్..తదనంతరం సూర్యాపేట లయన్స్ క్లబ్ సహకారంతో అల్పాహార వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐసీసీ సభ్యులు శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దామన్న ఈ ప్రాంతానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ,దామన్న ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాదిలు పాల్గొని అల్పాహార వితరణ చేశారు..కార్యక్రమం లో పార్టీ నాయకులు సంకరమద్ది శ్రావ్య రెడ్డి, ఎలిమినేటి అభినయ్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, యలగందుల సాయి నేత, మున్సిపల్ కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమాసతీష్,త్రివేణి హరి, ఇస్రర్ అహ్మద్,పగిళ్ల మల్లారెడ్డి,షాదం దామోదర్ రెడ్డి మన్సూర్ భాయ్,బద్దం రాజిరెడ్డి బద్దం మధుకర్ రెడ్డి,కక్కిరేణి అంజయ్య ,కక్కిరేణి ప్రసాద్, పిన్నెల్లి వెంకటేష్,నీడ్స్ సాజీద్, గడ్డం వెంకన్న, నాగేల్లి అరుణ్, రాచకొండ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి



ప్రజాస్పూర్తి, భైంసా: నిర్మల్ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో , సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ప్రజల మధ్య ఉన్న సోదరభావం, పరస్పర సహకారం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ముస్లిం మత పెద్దలు తమ చిన్ననాటి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. గతంలో గణేష్ ఉత్సవాల సమయంలో హిందూ సోదరులతో కలిసి పాల్గొన్న సందర్భాలను గుర్తుచేసుకుంటూ, నిర్మల్‌లో ప్రజల మధ్య ఉన్న స్నేహభావం, సోదరభావం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, తమకు ఉన్న సూచనలు , సమస్యలను మత పెద్దలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సూచనలు, అభ్యర్థనలను జిల్లా ఎస్పీ సానుకూలంగా విని, ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్య , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 107 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



ప్రజా స్పూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన. ఆయా గ్రామాలకు చెందిన మంజూరు పత్రాలను 107 మంది లబ్ధిదారులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు, పక్షపాతానికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్యానికి ఇవి శ్రీరామ రక్ష..

## రోజూ తీసుకుంటే ఊహించని అద్భుతాలు..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలు రెట్టింపు బాధ్యతలను మోస్తున్నారు. అటు ఆఫీసు పని, ఇటు ఇంటి బాధ్యతలను చక్కబెట్టే క్రమంలో తమ సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా చిన్న వయసులోనే తీవ్రమైన అలసట, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయితే వీటన్నింటికీ మన పురాతన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయని ప్రముఖ హెల్త్ కోచ్ డింపుల్ జాంగ్డా సూచిస్తున్నారు. ప్రతి మహిళ తన ఆహారంలో భాగం చేసుకోవాల్సిన మూడు ముఖ్యమైన మూలికల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అశ్వగంధ**

అశ్వగంధను కేవలం పురుషులకే పరిమితమైన మూలికగా చాలామంది భావిస్తారు. కానీ ఇది మహిళలకు ఒక సంజీవని లాంటిది. దీనిని అడాప్టోజెన్ అని పిలుస్తారు. ఇది శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను తగ్గించి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తుంది. థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరచడంలో, శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మార్కెట్లో లభించే అశ్వగంధ పొడిని గోరువెచ్చని పాలలో కలుపుకుని లేదా హర్బల్ టీ రూపంలో తీసుకోవచ్చు.

**శతావరి (ఆస్పరాగస్): స్త్రీలకు అసలైన నేస్తం**

ఆయుర్వేదంలో శతావరికి ఉన్న ప్రత్యేకతే వేరు. వంద రోగాలను నయం చేసే శక్తి దీని సొంతం. పీసీఓఎస్, సంతానలేమి, క్రమరహిత రుతుస్రావం వంటి సమస్యలతో బాధపడే మహిళలకు శతావరి అద్భుతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. మీరు గర్భం దాల్చాలని ప్లాన్ చేస్తున్నా లేదా మెనోపాజ్‌లో ఉన్నా, శతావరి హార్మోన్లను అదుపులో ఉంచుతుంది. బాలింతలలో పాల ఉత్పత్తిని పెంచడానికి కూడా ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని పాలు లేదా తేనెతో కలిపి రోజుకు ఒకసారి తీసుకోవడం శ్రేయస్కరం.

**తులసి: మానసిక ఉల్లాసానికి మారుపేరు**

ప్రతి ఇంట్లో ఉండే తులసి కేవలం పూజకే కాదు, ఔషధ గుణాల గని కూడా. తులసి శరీరంలో సెరోటోనిన్ విడుదలకు దోహదపడుతుంది. ఇది ఆందోళన, నిరాశను దూరం చేసి మనసును ఉల్లాసంగా ఉంచుతుంది.ఇది శరీరంలోని జీర్ణ అగ్నిని ప్రేరేపించి, జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల బరువు తగ్గాలనుకునే వారికి, నీరసంగా ఉండేవారికి మంచి ఫలితం ఉంటుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 34 ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఊపిరితిత్తులు, జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటాయి.

**ముఖ్య గమనిక: నిపుణుల సూచన**

ఆయుర్వేద మూలికలు సహజమైనవే అయినప్పటికీ, ప్రతి ఒక్కరి శరీర తత్వం వేరుగా ఉంటుంది. కాబట్టి వీటిని మీ దినచర్యలో భాగం చేసుకునే ముందు ఒకసారి ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణీలు, ఇతర మందులు వాడుతున్న వారు సరైన మోతాదు కోసం నిపుణుల సలహా తీసుకోవాలి.

ఆరోగ్యం అనేది బాధ్యత మాత్రమే కాదు, అది ఒక పెట్టుబడి. మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టినప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మూడు మూలికలను సరైన పద్ధతిలో వాడి సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోండి.



# మీ పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?

ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్.మీ శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కేలరీల ఖర్చు:**

సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక.

**పొట్ట కొవ్వుపై ప్రభావం:**

పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది.

**నడక:**

వయసు పైబడిన వారు, అధిక బరువు (Obesity) ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

**పరుగు:**

వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది.

**జాగింగ్ vs రన్నింగ్:**

రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు.

**ముఖ్యమైన చిట్కాలు:**

ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 3045 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. మీరు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. మీ లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.



# ఆరోగ్యకరమైన కళ్లను పొందండి!

## స్పష్టమైన కంటిచూపు కోసం 7 సులభమైన టిప్స్..

ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర స్క్రీన్‌లు ఉపయోగించడం అనేది కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్న విషయం తెలిసిందే. మనం ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూసినా, కంటి కండరాలు అలసిపోతాయి, కళ్ళు పొడిబారతాయి. అంతేగాక, చూపు సమస్యలు పెరిగిపోతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సరైన జీవనశైలి, పోషకాహారం, కొన్ని చిట్కాలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**1. 20-20-20 సూత్రం:**

అందరికీ తెలిసిన 202020 రూల్‌ని పాటించడం ద్వారా స్క్రీన్ చూడడం వల్ల కంటి కండరాలపై పడ్డ ఒత్తిడిని తగ్గించవచ్చు.
ప్రతి 20 నిమిషాలకు స్క్రీన్ చూడటం ఆపాలి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు గమనించాలి. ఈ అలవాటు కంటి కండరాలకు విశ్రాంతి ఇచ్చి, కళ్ళు పొడిబారడం, అలసటను తగ్గిస్తుంది.

**2. సరైన భంగిమ:**

స్క్రీన్ కళ్లకు కనీసం ఒక చేతి దూరంలో ఉండాలి. స్క్రీన్ కంటి స్థాయికి కాస్త దిగువగా ఉండేలా పొజిషన్ చేయాలి. గదిలో తగినంత వెలుతురు ఉండాలి, మరీ చీకటి లేదా మరీ ఎక్కువ కాంతి ఉండకూడదు.

**3. కనురెప్పలు వాల్చడం:**

స్క్రీన్ ఉపయోగిస్తున్నప్పుడు కనురెప్పలు సరిగ్గా వాల్చడం చాలా ముఖ్యం. మీరు కనీసం 60% తక్కువగా కనురెప్పలు వాల్చే అవకాశం ఉంటుంది. కనురెప్పలు వాల్చడం వల్ల కళ్ళు తేమగా ఉంటాయి, కళ్ల పొడిబారడం తగ్గుతుంది.

**4. నిద్ర, హైడ్రేషన్:**

ప్రతిరోజూ 7-9 గంటల పాటు నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల కళ్ళలో పొడిబారడం, కనురెప్పలు అవడం, దృష్టి మసకబారడం వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ 8-10 గ్లాసుల నీరు తాగాలి. డీహైడ్రేషన్ వల్ల కూడా కళ్ళు పొడిబారతాయి.

**5. UV రక్షణ:**

బయట ఉన్నప్పుడు UV రక్షణ ఉన్న సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది కంటి శుక్లాలు, రెటీనా సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**6. పోకాహారం**

కంటి ఆరోగ్యం ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కంటికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పోషకాలు:
**విటమిన్ A:** క్యారెట్లు, బొప్పాయి
**లూటిన్ & జింక్:** ఆకుకూరలు (పాలకూర), గింజలు
**ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్:** చేపలు, వాల్‌నట్స్, విత్తనాలు
**సిట్రస్ పండ్లు:** నారింజ, నిమ్మ

**7. కంటి వ్యాయామాలు**

**కనురెప్పలు ఆర్పడం:** కళ్ళను 10-15 సార్లు వేగంగా ఆర్పండి. ఆ తర్వాత కళ్ళు మూసి విశ్రాంతి తీసుకోండి.
**కనుబొమ్మలను తిప్పడం:** కళ్ళను నెమ్మదిగా వృత్తాకారంలో తిప్పండి. మొదట క్లాక్ వైజ్, తర్వాత యాంటీ క్లాక్ వైజ్.
**దృష్టిని మార్చడం:** మీ బొటనవేలును ముఖం దగ్గర ఉంచి దానిపై దృష్టి పెట్టండి, తర్వాత దూరంగా ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి.
ఈ చిట్కాలు కంటిపై ఒత్తిడిని తగ్గించి, చూపు దెబ్బతినకుండా కాపాడతాయి. అయితే, కంటి సమస్యలు సీరియస్‌గా మారితే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.





## తల్లైన తర్వాత తొలిసారిగా

గత ఏడాది నవంబర్‌లో తల్లిగా మారింది బాలీవుడ్ హీరోయిన్ కత్రినాకైఫ్. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఇంటికే పరిమితమైంది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా లేదు. ఏ ఈవెంట్‌లలో కనిపించలేదు. దాదాపు పది నెలల విరామం తర్వాత తొలిసారిగా పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ ఇంట వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలీవుడ్ సినీ, క్రీడా ప్రముఖులతో అంబానీ ఇల్లు కళకళలాడింది. ఈ వేడుకల్లో భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కత్రినా కైఫ్ పాల్గొన్నది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్నాయి. వీటిలో కత్రినాకైఫ్‌గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. ఒకప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ గ్లామరస్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న కత్రినా కైఫ్ ఇంతలా మారిపోయిందేంటి అంటూ కామెంట్లు పెడుతోన్నారు.

## సమంతకు సీమంతం

టాలీవుడ్ హీరోయిన్ సమంత త్వరలో మాతృత్వపు బంధంలోకి అడుగుపెట్టబోతుంది. ప్రెగ్నెంట్‌గా ఉన్న సమంతకు సీమంతం జరిగింది. శ్రీవిద్య సంప్రదాయానికి చెందిన కళావరణం (శ్రీకల్పం) అనే విధానంలో ఈ వేడుకలు జరిగినట్లు సమంత ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ పెట్టింది. ఈ సీమంతం వేడుకల్లో సమంత భర్త రాజ్ నిడిమోరు, స్టైలిస్ట్ నీరజ కోన, డిజైనర్ శిల్పారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సీమంతం వేడుకల తాలూకు ఫొటోలు, వీడియోలను సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. కళావరణం విధానాన్ని గురించి ఈ పోస్ట్‌లో వివరించింది. మన సంప్రదాయాలను నేను గౌరవిస్తా. ప్రతి ఆచారం వెనుక ఏదో బలమైన శక్తి ఉందని నమ్ముతా. కళావరణంలో శ్రీవిద్య ఉపాసకుల ప్రత్యేక మంత్రోచ్చారణలు చేస్తూ, పవిత్ర జలాలతో గర్భిణికి అభిషేకం చేస్తారని తెలిపింది.



Cinema




## నాలుగోసారి జోడీగా..?

భారతరత్న అవార్డు గ్రహీత, దిగ్గజ సంగీత కళాకారిణి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా తెలుగులో ఓ మూవీ రాబోతుంది. ఈ బయోపిక్‌ను మేకర్స్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. సుబ్బులక్ష్మి 101వ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 16 బుధవారం చెన్నైలో ఈ బయోపిక్ లాంచ్ కాబోతుంది. ఈ బయోపిక్‌లో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించబోతున్నట్లు వెల్లడించారు. సుబ్బులక్ష్మిగా రష్మిక నటించనుందని పేర్కొన్నారు. ఈ పాత్ర పేరు ఆధారంగానే ఈ సినిమాకు సుబ్బులక్ష్మి అమ్మ అనే టైటిల్ ఖరారు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సినిమాలో రష్మికకు జోడీగా విజయ్ దేవరకొండ, దుల్కర్ సాల్మన్ పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## కమల రెడ్డిగా శివగామి

బాహుబలిలో పవర్‌ఫుల్ పాత్రతో ప్రేక్షకులను మెప్పించిన సీనియర్ హీరోయిన్ రమ్యకృష్ణ కొంత గ్యాప్ తర్వాత మరో డిఫరెంట్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మంచు మనోజ్ హీరోగా డేవిడ్ రెడ్డి పేరుతో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. బ్రిటీషర్లను ఎదురించి పోరాడిన ఓ వీరుడి కథతో రాబోతున్న సినిమాలో రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలో కనిపించబోతుంది. కమల రెడ్డి అనే పాత్రలో ఆమె నటిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రమ్యకృష్ణ బర్త్‌డే సందర్భంగా ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చేతిలో కత్తితో సింహాసనం లాంటి పెద్ద కుర్చీలో కూర్చొని రమ్యకృష్ణ కనిపిస్తోంది.



## బాలీవుడ్ సినిమాకు రైటర్‌గా

టాలీవుడ్ హీరోయిన్ దిగంగనా సూర్యవన్షీ రచయితగా మారింది. బాలీవుడ్ సినిమాకు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించబోతుంది. కార్తికేయ హీరోగా నటించిన హిప్పీ మూవీతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత వలయం, సీటీమార్, క్రేజీ ఫెల్లో, శివంభజే సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. వీటిలో గ్లామర్‌తో ఆకట్టుకుంది ఈ బ్యూటీ. హీరోయిన్‌గా అంతగా సక్సెస్ కాలేకపోయిన ఈ బ్యూటీ కొత్త జర్నీ మొదలుపెట్టబోతుంది. బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య దర్శకత్వంలో గణేష్ డస్ట్ టూ స్టార్‌డస్ట్ పేరుతో తెరకెక్కుతోన్న మూవీకి దిగంగనా సూర్యవన్షీ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించబోతుంది. రైటర్‌గా ఈ సినిమాతోనే ఎంట్రీ ఇవ్వబోతుంది. కథానాయికగా అంతగా అవకాశాలు రాకపోవడంతోనే ఈ బ్యూటీ రైటర్‌గా మారినట్లు ప్రచారం జరుగుతోంది. సినిమాల్లోకి రాకముందు వేవ్స్, నిక్సెన్ ది మెర్మేడ్ అండ్ ది పవర్ ఆఫ్ లవ్ అనే బుక్స్ రాసింది. బిగ్‌బాస్ హిందీ సీజన్ 9లో ఓ కంటెస్టెంట్‌గా పాల్గొన్నది. శకుంతల, కృష్ణ అర్జున్, ఎక్ వీర్ కీ అర్దాస్ వీర అనే సీరియల్స్‌లో నటించింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.